వినోదమూ లేదు.. విజ్ఞానమూ శూన్యం

సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో కానరాని పిల్లల కార్యక్రమాలు

పెద్దల ఈవెంట్లకే అధికారులు పరిమితం • నీరుగారిన వీఎంఆర్‌డీఏ లక్ష్యం

బీచ్‌రోడ్డు: పిల్లలకు వినోదం, విజ్ఞానం అందించాలనే లక్ష్యంతో.. రూ.16 కోట్ల వ్యయంతో సిరిపురంలో వీఎంఆర్‌డీఏ నిర్మించిన చిల్డ్రన్స్ ఎరీనా పెద్దల కార్యక్రమాలకు వేదికగా మారింది. పెళ్లి విందులు, సినిమా ఫంక్షన్లు, మతపరమైన కార్యక్రమాలు, ఇతర వేడుకలకు నిలయమైంది. ఎందుకోసమైతే ఈ ఆడిటోరియాన్ని నిర్మించారో.. ఆ లక్ష్యం నీరుగారిపోయింది.

రూ.16 కోట్లతో ఆధునికీకరణ

చిన్నారులు, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే సినిమాలు, సమాజంపై బాధ్యతను పెంచే చిత్రాల ప్రదర్శనతోపాటు విజ్ఞానం అందించే సైన్స్ ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేయడానికి వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాను సిరిపురంలో నిర్మించింది. దీనిని ఆధునికీకరించేందుకు 2012లో పనులు ప్రారంభించారు. 2018 నాటికి రూ.16 కోట్లతో పనులు పూర్తి చేసి ఎరీనాను ఘనంగా ప్రారంభించారు. 600 సీట్లతో 4కే టెక్నాలజీతో థియేటర్‌ను రూపొందించారు. కింద ఫ్లోర్‌లో ఎగ్జిబిషన్ హాల్ నిర్మించారు. దేశంలోనే రెండో నిర్మాణంగా వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా రికార్డుకెక్కింది.

ఎనిమిదేళ్లలో నోచుకోని చిత్రాల ప్రదర్శనలు

దేశంలోనే రెండో చిల్డ్రన్స్ ఎరీనాగా పేరుగాంచిన ఈ ఆడిటోరియంలో గత ఎనిమిదేళ్లలో ఏడు చిత్రాలు కూడా ప్రదర్శించిన దాఖలాలు లేవు. 2018లో చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేసినా.. సాంకేతిక కారణాల వల్ల ఆ ఫెస్టివల్ విజయవంతం కాలేదు. దాని తరువాత ఒక్క చిల్డ్రన్ ఫెస్టివల్ కూడా నిర్వహించ లేదు.

విజ్ఞాన ప్రదర్శనల ఊసే లేదు

సైన్స్ ఎగ్జిబిషన్ల ద్వారా చిన్నారులకు, విద్యార్థులకు విజ్ఞానం అందించే చిల్డ్రన్స్ ఎరీనాను ఆధునికీకరించిన తరువాత నుంచి ఒక్క విజ్ఞాన ప్రదర్శన కూడా జరిగిన దాఖలాలు లేవు. మొదట్లో ప్రైవేటు సంస్థలు అప్పుడప్పుడు విద్యార్థులకు పోటీలు నిర్వహించడం మినహా వీఎంఆర్‌డీఏ నుంచి ఎటువంటి సైన్స్ ఎగ్జిబిషన్స్ లేవు. ఎరీనా ఆధునికీకరణ అనంతరం రెండేళ్ల పాటు చిన్నారులకు వీఎంఆర్‌డీఏ వేసవి శిక్షణ తరగతులను నిర్వహించి ఆ తరువాత వాటికి స్వస్తి పలికింది. గడిచిన ఐదేళ్లలో సమ్మర్ క్యాంపుల జోలికి పోలేదు. దీంతో చిన్నారులు ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసే వేసవి శిక్షణ తరగతుల్లో చేరేందుకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

పెద్దల కార్యక్రమాలకే ప్రాధాన్యం

చిల్డ్రన్స్ ఎరీనాలో చిన్నారుల కోసం కాకుండా వీఎంఆర్‌డీఏ పెద్దల కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యమిచ్చింది. గడిచిన ఏడేళ్లలో సినిమా ఫంక్షన్లు, రాజకీయ సమావేశాలు, మతపరమైన సమావేశాలు, విందులు వంటి వాటికి ఎరీనాను కేటాయించారు. వినోదం కాకపోయిన విజ్ఞానం అందించే సైన్స్ ఎగ్జిబిషన్లు వంటివి పిల్లల కోసం ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా


సైన్స్ ఎగ్జిబిషన్ల కోసం హాల్


చిల్డ్రన్స్ ఎరీనాలో ఫంక్షన్ డెకరేషన్


చిల్డ్రన్స్ ఎరీనాలో థియేటర్

“ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో చిన్నారుల కోసం చిత్రాల ప్రదర్శన, సైన్స్ ఎగ్జిబిషన్ల ఏర్పాటుపై తల్లిదండ్రుల నుంచి అనేక వినతులు వస్తున్నాయి. వీటిపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తరఫున వీఎంఆర్‌డీఏ కమిషనర్ దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తాం. చిన్నారులకు వినోదం, విజ్ఞానం అందించేందుకు కృషి చేస్తాం.

– గొండు సీతారాం, సభ్యుడు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ”

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు


దుర్గాదేవి పూజల్లో పాల్గొన్న పీతల గోవింద్, భక్తులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీలో ఆటో స్టాండ్ వద్ద దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ కుటుంబ సమేతంగా దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు.

జాబ్‌మేళాలో 83 మందికి ఉద్యోగాలు


మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి సుబ్బిరెడ్డి

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 83 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఏపీఎస్ఎస్‌డీ, జవహర్ నాలెడ్జ్ సెంటర్లు సంయుక్తంగా, జేకేసీ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఐ స్మార్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, మెడ్‌ప్లస్ ఫార్మా కంపెనీలు పాల్గొన్నాయి. విశాఖకు చెందిన వివిధ కాలేజీల నుంచి 477 మంది విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. వీరిలో 83 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సిహెచ్.సుబ్బిరెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ చాముండేశ్వరరావు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి రమేష్ పాల్గొని విద్యార్థులకు సూచనలిచ్చారు.

క్లుప్తంగా

సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 24 నుంచి 26 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. 'నాగరికతల మధ్య సంఘర్షణల పరిష్కారానికి తత్వశాస్త్రం, యోగా' అనే అంశం జరిగే ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధకులు పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, రెక్టార్ ఆచార్య కిషోర్‌బాబు, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, తత్వశాస్త్ర విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు, ప్రొఫెసర్ కృష్ణయ్య, యోగా విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.5 లక్షల విరాళం


ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు చెక్కు అందజేస్తున్న జీవీపీ ప్రిన్సిపాళ్లు

విశాఖ సిటీ: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి గాయత్రి విద్యా పరిషత్ రూ.5 లక్షలు విరాళంగా అందించింది. కళాశాలల ప్రిన్సిపాళ్లు శుక్రవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావును కలిసి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టి.వి.కృష్ణ, అసోసియేట్ డీన్ ఆచార్య నాగహనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


సీఈని కలిసిన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన శివప్రసాదరాజును జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంప చంద్రమౌళి నేతృత్వంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చీఫ్ ఇంజనీర్ మాట్లాడుతూ అందరం కలిసి నగరాభివృద్ధికి కృషి చేద్దామని సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్ రాజాన వెంకట్రావు, కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షులు పీఎస్ ప్రసాద్, పీఏ రాజు, సలహాదారులు పైలా కృష్ణారావు, ప్రసాద్, ఆర్ఏ నాయుడు, అల్లు గోవిందరావు సత్యనారాయణ, గణేష్, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

గురుద్వారా సద్ సంగత్ నూతన కార్యవర్గం

సీతమ్మధార: గురుద్వారా సద్ సంగత్ కార్యవర్గ ఎన్నికలు, సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. గురుద్వారా జంక్షన్‌లోని సద్ సంగత్ ఆవరణలో జరిగిన ఎన్నికల్లో కార్యవర్గ అధ్యక్షుడిగా డాక్టర్ దిల్జాసింగ్ ఆనంద్(సాహ్జి), ఉపాధ్యక్షుడిగా బల్జీత్‌సింగ్ బక్షి, కార్యదర్శిగా రమనీత్‌సింగ్, కోశాధికారిగా గురుప్రీత్ సింగ్ గిల్ ఎన్నికయ్యారు. మరో 11 మంది కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. వీరు రెండేళ్ల పాటు కొనసాగుతారని నిర్వాహక కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ సౌత్ ఇండియా సిఖ్ మిషన్ ఇన్‌చార్జిగా కూడా తాను కొనసాగుతున్నానని తెలిపారు. గురుద్వారా సద్ సంగత్ నిర్వహణలో తమకు సహకారం అందిస్తున్న సిక్కులకు ధన్యవాదాలు తెలిపారు. సేవా కార్యక్రమాలకు తమ కమిటీ పునరంకితమవుతుందని చెప్పారు.

తోటగరువు హైస్కూల్‌లో ఇంటర్న్‌షిప్


ఇంటర్న్‌షిప్ విద్యార్థులతో ఒకేషనల్ విద్య అధికారులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో ఆటోమోటివ్ ట్రేడ్‌కు సంబంధించి ఇంటర్న్‌షిప్ నిర్వహించారు. ఇక్కడ పదో తరగతి చదువుతున్న వారిలో 10 మంది బాలికలను ఎంపిక చేసి వారిని ఇంటర్న్‌షిప్ కోసం తీసుకెళ్లారు. వారికి నాలుగు రోజుల పాటు ఇండస్ట్రియల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా యుగ్ శక్తి ఒకేషన్ జిల్లా కో ఆర్డినేటర్ రిషికేష్, జీసీడీవో ఖలీసా బేగం బాలికలకు ఆటోమోటివ్ కోర్సు ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనివల్ల కలిగే ఉద్యోగ అవకాశాల గురించి తెలియజేశారు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన బాలికలకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని దుర్గాభవాని శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణా డిగ్రీ కళాశాలలో 7 నుంచి స్పాట్ అడ్మిషన్లు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్‌లో ప్రవేశానికి, మిగిలిన సీట్ల కోసం ఈ నెల 7 నుంచి 9 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని కళాశాలకు నేరుగా రావాలని అడ్మిషన్ల కో ఆర్డినేటర్ డి.రమేష్ కోరారు.

కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంవీపీ కాలనీ సెక్టార్–10లోని సమత డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో కెరీర్ ఆపర్చునిటీస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథి బి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ డిగ్రీ చదువు అనంతరం అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలు, వాటిని పొందడానికి చేయాల్సిన కసరత్తును విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డబ్ల్యూఎన్ఎస్ సంస్థ హెచ్ఆర్ నారాయణ, కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహారోత్సవ్


వంటకాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

బీచ్‌రోడ్డు: విద్యార్థుల్లో దాగి ఉన్న వంటల ప్రతిభను వెలికితీసి అందరి నోరూరించేలా ఆహారోత్సవ్ కొనసాగింది. శ్రీకాశ్యప్ డిగ్రీ కాలేజ్‌లో ఆహారోత్సవ్–2024 పేరిట శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ టి.ఆర్.ఎస్.వర్మ మాట్లాడుతూ దేశంలోని గొప్ప వంటకాల వైవిధ్యాన్ని అందరికీ తెలియజేయడం కోసం ఆహారోత్సవ్ నిర్వహించినట్లు తెలిపారు. మన సంప్రదాయాలకు అనుగుణంగా విద్యార్థినులు దుస్తులు ధరించి అన్ని వంటకాలను రుచిగా చేసి అలరించారన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


జ్వర లక్షణాలు వివరిస్తున్న మలేరియా సబ్ యూనిట్-2 అధికారి శేషుబాబు

మద్దిలపాలెం: ఇంటి పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని, ఎప్పటికప్పుడు నీటి నిల్వలు తొలగించాలని జిల్లా మలేరియా సబ్ యూనిట్–2 అధికారి శేషుబాబు సూచించారు. లక్ష్మీనగర్, శివాజీపాలెం ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా శేషుబాబు మాట్లాడుతూ జ్వర పీడితులను గుర్తించాలని, వారికి వచ్చిన జ్వర లక్షణాలను క్షుణంగా తెలుసుకోవాలని సూచించారు. ఇల్లు, ఇంటి పరిసరాల్లో వారం రోజులు దాటి నీటి నిల్వలు ఉంటే దోమల ఉత్పత్తికి దోహదపడతాయన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వైఎస్‌పీ బర్రె కుమార్, ఆరోగ్య కార్యకర్త కోనా వేణుగోపాల్ పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి వ్యాధులపై అవగాహన


ప్రసంగిస్తున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి

మహారాణిపేట: వ్యాధులపై గ్రామ స్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. పేగు సంబంధిత వ్యాధులపై వైజాగ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ క్లబ్ అసోసియేషన్, కోలైటా అండ్ కార్న్స్ ఫౌండేషన్ ఇండియా సంయుక్తంగా విశాఖ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎనిమిదో జాతీయ స్థాయి సదస్సు శుక్రవారం మొదలైంది. నగరంలోని ఓ హోటల్‌లో కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్ ఆధ్వర్యంలో జరిగింది. జాతీయ సదస్సుకు దేశ, విదేశాలతోపాటు బ్రిక్స్ నుంచి కూడా పది మంది గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణులు హాజరై ఆయా దేశాల్లో అమలవుతున్న నూతన వైద్య పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేగు తదితర వ్యాధులకు నూతన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. విదేశీ వైద్యులు డాక్టర్ కేడియాచే క్రోన్స్, డాక్టర్ సైమన్ ట్రావిస్ (యూఎస్ఏ), డాక్టర్ అజిత్ సూద్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ చలపతి రావు, ఏఎంసీ మాజీ హెచ్‌వోడీ డాక్టర్ పెదవీర్రాజు, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ విశ్వనాథ్, కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల తోడ్పాటుతో సంస్థ ప్రగతి


వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: పనిచేసే చోట మానసిక ప్రశాంతతకు తగిన ప్రాధాన్యమివ్వాలని, తద్వారా సంస్థ ప్రగతికి ఉద్యోగులు మరింత తోడ్పాటు అందిస్తారని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో శుక్రవారం వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ప్రారంభించిన కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహిస్తే రెట్టించిన ఉత్సాహంతో విధులు నిర్వర్తిస్తారన్నారు. ఒత్తిడిని అధిగమించి సంస్థకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జాయింట్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తూ టీపీటీ నుంచి వుడా తరువాత వీఎంఆర్‌డీఏగా రూపాంతరం చెంది ప్రజల్లో బలమైన ముద్ర వేసుకుందని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన విజన్ 2047 ద్వారా వీఎంఆర్‌డీఏ ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శిల్పా, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, డీఎఫ్‌వో శాంతిస్వరూప్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ఎస్టేట్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన సాంఘిక నాటికలు


నిన్ను నువ్వు తెలుసుకో.. నాటికలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: మద్దిల పాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ప్రదర్శించిన సాంఘిక నాటికలు ఆలోచింపజేశాయి. కళాభారతి ప్రతి నెలా మొదటి శుక్రవారం నిర్వహిస్తున్న నాటికల్లో భాగంగా గాజువాక నడిపూరులోని మాతృశ్రీ కళానికేతన్ వారిచే ప్రదర్శింపజేసిన నిన్ను నువ్వు తెలుసుకో, చూపులు కలవని శుభవేళ నాటికలు అద్భుతంగా ఉన్నాయి. వీటిని విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కమెడియన్ అప్పారావు, నాంచారయ్య జగన్నాథరావులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదటిగా 'నిన్ను నువ్వు తెలుసుకో' నాటికను చక్కటి హావభావాలతో ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. ఎవరికీ వారే గొప్ప అనుకుని ఇతరులను విమర్శించడం వల్ల కలిగే ఇబ్బందులను చక్కని సన్నివేశాలతో వివరించారు. చూపులు కలవని శుభవేళ నాటిక ఆద్యంతం నవ్వులు పూయించింది. ప్రతి సన్నివేశానికి ప్రేక్షకులు చప్పట్లు కొట్టి వారి ఆనందాన్ని తెలియజేశారు.

27న కందుకూరిపై ప్రసంగం

ఈ నెల 27న కళాభారతిలో సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులుపై ప్రసంగం ఉంటుందని వీఎండీఏ కార్యదర్శి రాంబాబు తెలిపారు. ఆయనపై పాఠశాలలో వ్యక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులుగా రూ.3,000, రూ.2,000, రూ.1,000 అందజేస్తామని ప్రకటించారు. ఆసక్తి గలవారు పోటీలో పాల్గొనాలని కోరారు.

జూ పార్కులో హడావుడి


జూ పార్కులోని బయోస్కోప్ పరిసరాల్లో శుభ్రం చేసి మొక్కలు నాటుతున్న సిబ్బంది

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో రెండు రోజులుగా అధికారులు, సిబ్బంది ఒకటే హడావుడి చేస్తున్నారు. అవసరమైన చోట్ల మరమ్మతులు చేస్తున్నారు. పిచ్చి మొక్కలు తొలగించి.. రోడ్ల పక్కన అందమైన మొక్కలు నాటుతున్నారు. ఇంతకీ విషయం ఏమిటంటే.. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 7న జూ పార్కును సందర్శిస్తారని అధికారులకు సమాచారం వచ్చిందట. దీంతో జూ అధికారులు పరుగులు తీస్తున్నారు. అటవీశాఖ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించేలా బయోస్కోప్‌ను సిద్ధం చేస్తున్నారు. బయోస్కోప్ ముందు కొన్నేళ్లుగా రంగులు ఊడిపోయి, తుప్పపట్టిపోయిన ఇనుప గ్రిల్స్‌కు మరమ్మతులు చేస్తున్నారు. గ్లోబుకు రంగులు వేస్తున్నారు. దాని చుట్టూ ఉన్న ఇనుప గ్రిల్స్‌ను బాగు చేస్తున్నారు. పిచ్చి మొక్కలు తొలగించి.. పచ్చని మొక్కలు నాటుతున్నారు. జూ ప్రధాన ద్వారంతో పాటు లోపల ఎక్కడెక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే పనులను కూడా ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఇదంతా చూస్తున్న సందర్శకులు.. ఎవరో వస్తే గానీ జూను పట్టించుకోరా.. రోజూ ఇలానే ఉంచడం సాధ్యం కాదా? అని అధికారులను ప్రశ్నిస్తున్నారు. మంత్రి వస్తున్నారని కాకుండా.. జూ పార్కును నిత్యం శుభ్రంగా, అందంగా ఉండేలా చూడాలని కోరుతున్నారు.

'ఉనికిని కాపాడుకునేందుకు జనసేనాని అగచాట్లు'

మద్దిలపాలెం: అధికారంలోకి వచ్చాక.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీరు మారిందని రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ ముందు తన ఉనికిని కాపాడుకునేందుకు జనసేన పార్టీ తెగ అగచాట్లు పడుతోందని విమర్శించారు. అచ్యుతాపురం ప్రమాదం, బుడమేరు వరద ముప్పు సందర్భాల్లో ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి, సహా మంత్రులందరూ పర్యటించారన్నారు. అటువంటి కీలక సమయంలో కూడా శాంతిభద్రతల రీత్యా గ్రౌండ్ లెవెల్ పర్యటనలు చేయలేక పోయానని పవన్ కల్యాణ్ తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ నిరాశలో నుంచి బయటకు రావడానికో లేక వేరే ఎజెండాను రాష్ట్రంలో తేవడానికో తిరుపతి లడ్డూ వివాదం వచ్చిన దగ్గర నుంచి ఏదో ఒక కామెంట్ చేస్తూ ప్రతి రోజూ వార్తల్లో నిలుస్తున్నారని ఎద్దేవా చేశారు. మా పార్టీ విధానాలతో కొత్త సమాజాన్ని సృష్టిస్తామన్న నాయకుడు పవన్ నేడు తన ఉనికిని కాపాడుకోడానికి అందరి మధ్య వివాదాలు రగిల్చేలా మాట్లాడుతున్నారన్నారు. ప్రాయశ్చిత్తం అనేది తప్పు చేసిన వారు చేసుకోవాలని, అన్ని విషయాల్లో ప్రజలకు స్వాంతన కలిగేలా వ్యవహరించాలని సూచించారు.